

నేటి దినపత్రిక

సూర్య

www.suryaa.com

19 వ వసంతంలోకి ...

ఎన్టీఆర్ కృష్ణా

గురువారం 18 డిసెంబర్ 2025 పేజీలు 8


# కలవరపెడుతున్న కోతులు, అడవి ఆవులు



### సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు గౌరవ సీఎం ఆదేశాలు

### ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 17, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాలో గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ కోతులు ప్రజల్ని కలవరపెడుతున్నాయని.. అదేవిధంగా నందిగామ నియోజకవర్గంలో అడవి ఆవులు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రికి వివరించి నట్లు కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం కలెక్టర్ల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కోతులు, అడవి ఆవుల సమస్యను గౌరవ సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి ఉన్న మార్గాలపై దృష్టిసారించనున్నట్లు సీఎం చెప్పారన్నారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, పశు సంవర్ధక, అటవీ మున్సిపల్ తదితర శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు ఆదేశాలిచ్చారన్నారు. విజయవాడ అర్బన్ పరిధిలోని వివిధ వార్డుల్లో కోతులు స్థానికులను ఇక్కట్లకు గురిచేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడుతున్న ఘటనలు తరచు చోటుచేసుకుంటున్నాయి. ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్న ఉదంతాలు ఎదురవుతున్నాయి. గ్రామాల్లో అయితే ముఖ్యంగా ఉద్యాన పంటలను నాశనం చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. అదేవిధంగా నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలంలోని గ్రామాల్లో పంటలను అడవి ఆవులు ధ్వంసం చేస్తున్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు కలెక్టర్ లక్ష్మీశ.. సమన్వయ శాఖల అధికారులతో కలిసి ఇప్పటికే వెలది గ్రామం వద్ద డ్రోన్లతో అడవి ఆవుల జాడను పరిశీలించారు. ఈ సమస్య పరిష్కారానికి సరైన మార్గాన్ని అన్వేషించే పనిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా కోతులు, అడవి ఆవుల సమస్యను కలెక్టర్ లక్ష్మీశ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



### ఈ - కార్యాలయ దస్త్రాలను పరిష్కరించడంలో..

# మొదటిస్థానంలో కృష్ణాజిల్లా కలెక్టర్ డీకేబాలాజీ

### అగ్రస్థానంలో నిలిచినందుకు డీకే బాలాజీనీ అభినందించిన సీఎం నారా చంద్రబాబు నాయుడు

కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ : కొన్ని గంటల్లో ఈ - కార్యాలయ దస్త్రాలను పరిష్కరించడంలో నలుగురు జిల్లా కలెక్టర్లు నిలవగా అందులో కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అగ్రస్థానంలో నిలిచినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని 5వ బ్లాక్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, డిజిపి హరీష్ కుమార్ గుప్తా, మంత్రివర్గ సహచరులు, వివిధ ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, అధిపతులతో కలసి మొదటిరోజు జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి గత 3 నెలలుగా జిల్లాల వారీగా ఈ-కార్యాలయ దస్త్రాల పరిష్కారం పై సమీక్షిస్తూ కృష్ణా జిల్లా కలెక్టర్ తో పాటు నలుగురు జిల్లా కలెక్టర్లు ఒకరోజు కంటే తక్కువగా కొన్ని గంటల్లోనే ఈ- కార్యాలయ దస్త్రాలను పరిష్కరించారన్నారు. అందులో కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రథమ స్థానంలో నిలిచారని అభినందించారు. క్షేత్ర స్థాయి కార్యాలయాల్లో సిబ్బంది ముఖ్యంగా వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు రీ సర్వే కార్యక్రమంలో భాగంగా ఉదయమే గ్రౌండ్ ట్రూతింగ్ కోసం వెళ్తుంటారని వారికి విధుల హాజరు నుండి మినహాయింపు సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. అంతకు మునుపు క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరుపై సమీక్షిస్తూ 74 శాతం మంది విధులకు హాజరవుతున్నట్లు, 26% మంది హాజరు వేయడం లేదని, కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్న ప్రజాభిప్రాయం ఉందని రాష్ట్ర ఐ టి ఈ అండ్ సి ఆర్టీజియస్ కార్యదర్శి కాటంనేని భాస్కర్ చెప్పడంతో జిల్లా కలెక్టర్ పై విధంగా స్పందించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి వెంటనే స్పందిస్తూ కార్యాలయానికి రాని వారి పట్ల కలెక్టర్లు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, క్షేత్ర పర్యటనకు వెళ్లిన వారికి మినహాయింపు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని కార్యదర్శికి సూచించారు. భూగర్భ జలాలపై జిల్లాల వారీగా విశ్లేషిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి కృష్ణాజిల్లాలో ఈ ఏడాది జూన్ 1 వ తేదీ నాటికీ 9.45 మీటర్ల లోతులో నీరు ఉంటే ప్రస్తుతం నవంబర్ 25 నాటికి 7.69 మీటర్ల లోతుకు వచ్చిందన్నారు. పంచాయతీరాజ్ శాఖతో ప్రణాళిక సిద్ధం చేసుకుని వచ్చే వర్షాల తర్వాత పెంపుదల చేయాలని సూచించారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్ వివరణ కోరగా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ జిల్లాల్లో బాపులపాడు,

మిగతా 2లో

## మరింత వేగంగా అంగన్వాడీ సేవలు

- 5జి సెల్ ఫోన్లతో నూతన సాంకేతికత
- మహిళలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- 292 మందికి రూ.36.50లక్షల విలువైన మొబైల్స్ అందజేత

8



## నగరంలో హెల్మెట్ అవశ్యకతపై వినూత్న కార్యక్రమాలు

8

### స్పెషల్ డ్రైవ్లో ట్రాఫిక్ డిసిపి షేక్ షరీన్ బేగం



## రెండు శతాబ్దాలుగా ఆబాల గోపాలం



వివరాలు 5 లో

(మొదటిపేజీ తరువాయి)



## ఈ - కార్యాలయ దస్త్రాలను పరిష్కరించడంలో.. మొదటిస్థానంలో కృష్ణాజిల్లా కలెక్టర్ డీకేబాలాజీ

గన్నవరం వంటి నాలుగు మండలాలు అప్లాండ్‌లో ఉన్నాయని, అక్కడ 3 నెలల్లో భూగర్భ జలాలు పెంపుదలకు తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కాన్ఫరెన్స్ లో నగరంలోని కలెక్టరేట్ వీసీ హాల్ నుండి సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, కెఆర్ఆర్‌సిఎస్‌డిసి శ్రీదేవి, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి పోతురాజు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి చిన్న నరసింహులు, మత్స్యశాఖ జేడీ అయ్యా నాగరాజ, బీసీ సంక్షేమ అధికారి రమేష్, బీసీ కార్పొరేషన్ ఈడీ రాజేంద్ర కుమార్, జడ్పీటీసీఈఓ ఆనంద్ కుమార్, డిసిఓ చంద్రశేఖర్ రెడ్డి, డి.ఎస్.ఓ మోహన్ బాబు, డిపిడిఓ వెంకటేశ్వర్లు, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మెరుగైన విద్య కోసం రోడ్ టు స్కూల్ ప్రారంభం



హనుమాన్ జంక్షన్, డిసెంబర్ 17 మేజర్ న్యూస్ : బాపులపాడు మండలంలోని అమూల్య ఫంక్షన్ హాల్‌లో అశోక్ లేలాండ్, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సంయుక్తంగా రోడ్ టు స్కూల్ ఓరియంటేషన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. మండల విద్యాశాఖ అధికారి రాంబాల సింగ్ ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ప్రశంసించారు. రాంబాల సింగ్ మాట్లాడుతూ, రోడ్ టు స్కూల్ ద్వారా పాఠశాలలకు అందుతున్న సేవలను ప్రధానోపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇది ఒక పెద్ద దోహదమని తెలిపారు. 2015లో 35 పాఠశాలలతో ప్రారంభమైన ఈ కార్యక్రమం, 8 రాష్ట్రాల్లో 5.7 లక్షల విద్యార్థులకు చేరి 3000 ప్రభుత్వ పాఠశాలల్లో అమలులో ఉంది. ప్రాథమిక, మధ్య పాఠశాలల్లో అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, వెల్నెస్, కళ, క్రీడా విద్యలను సమగ్రంగా అందిస్తూ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలతో విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది. ప్రధానంగా 9-12 తరగతి విద్యార్థులు డిజిటల్ నైపుణ్యాలు, కెరీర్ అవగాహన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వెల్నెస్ సెషన్‌లు పొందుతున్నారు. 2023-24లో 12వ తరగతి విద్యార్థులలో 85% మంది ఉన్నత విద్యలో చేరారు. నవంబర్ 2025లో బాపులపాడు మండలంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం 60 ప్రభుత్వ పాఠశాలల 3900 విద్యార్థులకూ చేరి, వ్యక్తిగత కెరీర్ మార్గదర్శకత్వం అందిస్తోందని, ఈ ప్రోగ్రాం అశోక్ లేలాండ్ ఫౌండేషన్ విద్యా సమానత్వానికి దీర్ఘకాలిక నిబద్ధతను ప్రతిబింబిస్తుందని లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ బ్లాక్ మేనేజర్ చిన్న బ్రహ్మయ్య తెలిపారు.

## ప్రారంభమైన గొబ్బిళ్ళసందడి



**మొవ్వ మేజర్ న్యూస్:** సంక్రాంతి నెల బుధవారం నుంచి ప్రారంభం కావడంతో గ్రామాలలో మహిళలు తమ ఇంటి ముందు రకరకాల ముగ్గులు వేసుకోని గొబ్బెమ్మలను పెట్టుకోవడంలో సందడిగా మారారు. కంప్యూటర్ యుగం, సెల్ ఫోనులమోజు కొనసాగుతున్నా కూడా తరతరాలుగా వస్తున్న తెలుగువారి సాంప్రదాయాన్ని పలువురు ఆడపిల్లలు సాంప్రదాయ సిద్ధంగాపాటిస్తున్నారు. దీనిలో భాగంగానే వచ్చేనెల14వ తేది వరకు ఆకర్షణీయమైన ముగ్గులు, ఆవు పేడతో తయారైన గొబ్బెమ్మలను ఇంటి లోగిలి ముందు పెట్టుకోవడంతో వీధులు ఆకర్షణీయంగా మారాయి.

# వ్యవసాయమే మన సంస్కృతికి నాంది





**మొవ్వ మేజర్ న్యూస్:** వ్యవసాయమే మన సంస్కృతికి నాందని స్థానిక శాసనసభ్యులు వర్ల. కుమార్ రాజా పేర్కొన్నారు. ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల, బాపట్ల వ్యవసాయ కళాశాల విదార్థినులు సంయుక్తంగా నిర్వహించిన గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శనలు మండల కేంద్రమైన మొవ్వ క్షేత్రయ్య కళ్యాణ మండపశీలో బుధవారం నిర్వహించారు. ఈ స్థానిక శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా ముఖ్య అతిథి గా పాల్గొని వ్యవసాయ విద్యార్థినులు వ్యవసాయ, అనుబంధ రంగాలలో నూతన సాంకేతికను తెలిపేల తయారు చేసిన ప్రతిరూప నమూనాలను ఎమ్మెల్యే వీక్షించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడు తూ వ్యవసాయమే మన సంస్కృతికి నాందని, వ్యవసాయ విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు ఈ కార్యక్రమం విజయవంతంగా చేయడంతోపాటు ఇటువంటి వినూత్న కార్యక్రమాలు మరిన్ని చేపట్టి, రైతులకు అందుబాటులో మరిన్ని సేవలు అందించి రైతులను ప్రగతి బాటలో నడిపించాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త సుధా రాణి కి ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో కే.వి.కే సమన్వయ కర్త డా. డి. సుధారాణి బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు విద్య ప్రణాళిక గురించి మూడు నెలలుగా వివిధ గ్రామాలలో ఉంటూ చేసిన కార్యక్రమాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల కళాశాల ప్రిన్సిపాల్ ప్రతినిధిగా ప్రసన్న కుమారి, ఆర్.డబ్ల్యూ.ఇ. పి. ఇంచార్జి సువర్ణ లత, మొవ్వ గ్రామ సర్పంచ్ టి. పూర్ణ చంద్ర రావు, మొవ్వ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరామయ్య, మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు, గొర్రెపాటి రామకృష్ణ, మొవ్వ మండల అభివృద్ధి అధికారి డి. సుహాసిని, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, ఉద్యావన అధికారి జ్యోతి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, సిబ్బంది, వివిధ గ్రామాల ఆదర్శ రైతులు, బాపట్ల వ్యవసాయ కళాశాల విదార్థినులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లో ఓవర్ హెడ్ ట్యాంక్‌కు ఆటోమేటిక్ సిస్టం ను ఏర్పాటు చేయండి



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** అన్న క్యాంటీన్లో ఓవర్ హెడ్ ట్యాంక్‌కు ఆటోమేటిక్ సిస్టంను ఏర్పాటు చెయ్యాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. బుధవారం ఉదయం హెచ్ బి కాలనీ అన్నా క్యాంటీన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి అన్న క్యాంటీన్లో ఓవర్ హెడ్ టాంక్స్ కు ఆటోమేటిక్ సిస్టం ఏర్పాటు చేయాలని తద్వారా ట్యాంక్ లో నీరు నిండిన వెంటనే ఆటోమేటిక్గా మోటార్ ఆఫ్ అయిపోయి ట్యాంక్ నిండకుండా నీరు వృధా కాకుండా చూసుకోవచ్చని అధికారులను ఆదేశించారు. నిర్ణీత సమయాలలో క్రమ తప్పకుండా వాటర్ ట్యాంక్ ను పరిశుభ్రం చెయ్యాలని, అన్ని అన్న క్యాంటీన్లలో ఉన్న వాటర్ ట్యాంకులపై మూత ఖచ్చితంగా ఉండాలని. క్రమ తప్పకుండా అన్న క్యాంటీన్ పైకప్పును పరిశుభ్రపరిచారని తద్వారా రూఫ్ లీకేజీలు ఉండవని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రతి అన్న క్యాంటీన్ కు కేటాయించిన నోడల్ ఆఫీసర్లు ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి.సత్యకుమారి చీఫ్ సిటీ ప్లానర్ కె సంజయ్ రత్నకుమార్, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, పర్యవేక్షణ ఇంజనీర్ శ్రీనివాస్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.



## సచివాలయాల్లో ప్రతిరోజు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఖచ్చితం గా నిర్వహించాలి

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రతి సచివాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రతిరోజు ఖచ్చితంగా నిర్వహించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ప్రతి మంగళవారం నుండి శనివారం వరకు మధ్యాహ్నం మూడు గంటల నుండి 5 గంటల వరకు ప్రతి సచివాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఖచ్చితంగా నిర్వహించాలని అన్నారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం ఎలా చూపాలన్న అంశం పై సచివాలయం సెక్రటరీలకు బుధవారం ఉదయం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించారు అధికారులు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే సచివాలయం సెక్రటరీ ముందుగా ఫిర్యాదుదారునికి వద్దకు వెళ్లి గౌరవంగా మాట్లాడాలని, వారి సమస్యను పూర్తిగా అర్థం చేసుకొని త్వరలో ఆ సమస్య పరిష్కరించి ఫిర్యాదుదారునికి తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు ప్రభుదాస్, కె షమ్మీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, శ్రీనివాస్, ఏ యు బి శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## శాఖధిపతులు డ్రోన్లతో పర్యవేక్షించండి



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** శాఖాధిపతులందరూ డ్రోన్లతో ప్రతిరోజు పర్యవేక్షిస్తుండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా వన్ టౌన్ వినాయకుని గుడి, కెనాల్ రోడ్, కృష్ణవేణి ఘాట్, భవానిపురం, హెచ్ బి కాలనీ ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శాఖాధిపతులందరూ ప్రతిరోజు తమ తమ విభాగాలలో డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తుండాలని, తద్వారా సమస్య పూర్తిస్థాయిలో తెలుసుకోవచ్చని అన్నారు. ముందుగా కృష్ణవేణి ఘాట్ లో పర్యటించి అక్కడున్న వ్యర్థాలను డ్రోన్ తో పరిశీలించి, అధికారులకు ఆ వ్యర్థాలు తొలగించేటట్టు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. కంటికి కనపడే సమస్యల కంటే కంటికి కనపడని సమస్యలను డ్రోన్లతో పర్యవేక్షించడం ద్వారా పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరించవచ్చని అన్నారు. వన్ టౌన్ వినాయకుని గుడి వద్ద నుండి కెనాల్ రోడ్డులో పర్యటించి అక్కడ పాడైపోయిన మెష్ ను గమనించి, త్వరగా బాగు చెయ్యాలని అధికారులను ఆదేశించారు. తదుపరి దుర్గా ఘాటు వద్ద ఉన్న పబ్లిక్ టాయిలెట్లను పరిశీలించారు. నగర పరిధిలో అన్ని మరుగుదొడ్లు ఎటువంటి మరమ్మతులు లేకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటూ ఉండాలని అధికారులను ఆదేశించారు. క్రాంబే రోడ్ లో హరితాన్ని పెంచి సుందరీకరించాలని అన్నారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి.సత్యకుమారి చీఫ్ సిటీ ప్లానర్ కె సంజయ్ రత్నకుమార్, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, పర్యవేక్షణ ఇంజనీర్ శ్రీనివాస్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.



## విజేతగా నిలిచిన ఉపాధ్యాయునికి ఘన సత్కారం

**మొవ్వ మేజర్ న్యూస్:** గుంటూరు జిల్లాలో జరిగిన 45వ ఏపీ స్టేట్ ఉపాధ్యాయుల అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలలో పెదపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులుఎస్. శివ నాగమల్లేశ్వరరావు, 4ఐ100 లో బంగారు పతకం,200 మీటర్స్ రన్నింగ్ లోరజత పతకం, 100 మీటర్లు, 400 మీటర్లు రన్నింగ్లలో కాంస్య పతకాలు సాధించి విజేతగా నిలిచారు. ఉపాధ్యాయులు శివనాగేశ్వరరావును పాఠశాల ఎస్ఎంసి చైర్ పర్సన్ రజని,పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయలు, సిబ్బంది, విద్యార్థులు దుశ్శాలువాతో బుధవారం ఘనంగా సత్కరించి అభినందించారు.

# 100 మంది నిరుపేద విద్యార్థినులకు అండగా ఓయాసిస్ ఫెర్టిలిటీ

**విజయవాడ, డిసెంబర్ 17, మేజర్ న్యూస్ :** భారత్‌లోని నమ్మకమైన ఫెర్టిలిటీ కేర్ అందిస్తున్న సంస్థలలో ఒకటైన ఓయాసిస్ ఫెర్టిలిటీ, కే. సీ. మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్, నాందీ ఫౌండేషన్ ద్వారా సంయుక్తంగా నిర్వహించబడుతోన్న ప్రాజెక్ట్ నన్హీ కలీతో భాగస్వామ్యం కుదుర్చుకుని, 100 మంది పేద బాలికల విద్యకు మద్దతు ప్రకటించింది. ఓయాసిస్ ఫెర్టిలిటీ 'హ్యాపీ న్యూ ఫ్యామిలీ' ప్రచారంలో భాగంగా తాజా ప్రకటన విడుదల చేసింది. 2026 నూతన సంవత్సరంలో తల్లిదండ్రులవ్వాలని అనుకుంటున్న జంటలను తమ ప్రయాణాన్ని ప్రారంభించడానికి, సరైన సమాచారంతో ముందస్తుగా అడుగులు వేయాలని ఈ ప్రచారం ప్రోత్సహిస్తుంది. ఓయాసిస్ 'హ్యాపీ న్యూ ఫ్యామిలీ' ప్రచారం కింద, ఓయాసిస్‌లో తల్లిదండ్రులు కావాలని కోరుకునే దంపతులు కూడా ప్రాజెక్ట్ నన్హీ కలీ ద్వారా వెనుకబడిన వర్గాల బాలికలకు మంచి భవిష్యత్తు ఇవ్వడానికి ఓయాసిస్‌తో కలిసి పాల్గొంటారు.




ఈ కార్యక్రమం ద్వారా, ఎంపిక అయిన నన్హీ కలీ బాలికల విద్యా సంవత్సరానికి అయ్యే ఖర్చును పూర్తిగా ఓయాసిస్ ఫెర్టిలిటీ భరిస్తుంది. ఇందులో భాగంగా డిజిటల్ లెర్నింగ్, ఆర్థిక పరిజ్ఞానం, జీవన నైపుణ్యాల అభివృద్ధి, క్రీడా నాయకత్వ శిక్షణ ఉంటాయి. అంతే కాకుండా, ప్రతి బాలికకు బ్యాగ్, బూట్లు, శానిటరీ ప్యాడ్‌లు, స్టేషనరీ, టీ-షర్టులు వంటి ముఖ్యమైన వస్తువులు ఉన్న నన్హీ కలీ కిట్ అందుతుంది. సదరు బాలికలు గౌరవంగా, నిలకడగా, ఆత్మవిశ్వాసంతో తమ విద్యను కొన సాగించేలా చూడటమే దీని ప్రధాన లక్ష్యం. ఈ భాగస్వామ్యం ద్వారా, ఆత్మ స్థైర్యం పొందిన మహిళలు, బాలికలతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఓయాసిస్ ఫెర్టిలిటీ విశ్వసిస్తుంది. ప్రాథమిక విద్యకు మద్దతు ఇవ్వడం ద్వారా, పేదరికం నుండి బయటపడటానికి సహాయం చేయాలని, బాలికలు తమ శక్తిసామర్థ్యాలను పూర్తిగా ఉపయోగించుకునేలా చేయాలని ఓయాసిస్ ఫెర్టిలిటీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా ఓయాసిస్ ఫెర్టిలిటీ కో ఫౌండర్, మెడికల్ డైరెక్టర్ డా. దుర్గా జి రావు మాట్లాడుతూ... "ఓయాసిస్‌లో సైన్స్ జీవితాలను మారుస్తుంది అని మేం బలంగా విశ్వసిస్తాం. అదే విధంగా, సరైన అవకాశాలు కూడా జీవితాన్ని మారుస్తాయి. అనేకమంది బాలికలకు రకరకాల కారణాల వల్ల చదువుకునే అవకాశం ఉండట్లేదు. ప్రాజెక్ట్ నన్హీ కలీతో మా భాగస్వామ్యం ద్వారా, అర్హులైన బాలికలను పాఠశాలలకు పంపి, వారిలో ఆత్మవిశ్వాసం పెంచి, అవకాశాలతో కూడిన భవిష్యత్తును నిర్మిస్తున్నాం. విద్య అనేది సాధికారతకు ఉన్న గొప్ప మార్గాలలో ఒకటి. దానికి మద్దతు ఇవ్వడం మాకు గర్వకారణం" అని పేర్కొన్నారు. ఓయాసిస్ ఫెర్టిలిటీ సీఈఓ పుష్పరాజ్ షెనాయ్ మాట్లాడుతూ,"నవంబర్‌లో, మేం ఐవీఎఫ్ ద్వారా పుట్టిన పిల్లలకు 'ఓయాసిస్ ఆయుష్మాన్ స్కాలర్‌షిప్' ఇచ్చి సత్కరించాం. ఆ విజయం తర్వాత, తాజాగా చేపట్టిన మా 'హ్యాపీ న్యూ ఫ్యామిలీ' ప్రచారం ముఖ్య ఉద్దేశాన్ని మరింత బలోపేతం చేస్తుంది. అంటే, కొత్త ఆరంభాల ఆలోచనను కేవలం చికిత్సకే కాకుండా, సమాజంలోని ఇతరులకు కూడా అందిస్తున్నాం. బాలికల విద్యకు మద్దతు ఇవ్వడం అనేది సమాజంపై దీర్ఘకాలికంగా సానుకూల ప్రభావం చూపడానికి ఉన్న మంచి మార్గం. ప్రాజెక్ట్ నన్హీ కలీతో మా భాగస్వామ్యం, శాశ్వతమైన మార్పునకు దోహదపడటానికి, మా వైద్య సేవలకు మించిన సామాజిక బాధ్యత పట్ల మా నిబద్ధతను తెలియజేయడానికి ఉపయోగపడుతుంది" అని వివరించారు.

ప్రాజెక్ట్ నన్హీ కలీ వైస్ ప్రెసిడెంట్ స్వాతి శ్రీవాస్తవ్ మాట్లాడుతూ... "విద్యా అవకాశాలు లేని బాలికల చదువుకు ఓయాసిస్ ఫెర్టిలిటీ ఇస్తున్న మద్దతును మేం అభినందిస్తున్నాం. ప్రాజెక్ట్ నన్హీ కలీలో భాగంగా మా దృష్టి ఎల్లప్పుడూ బాలికలు గౌరవంగా, ఆత్మవిశ్వాసంతో చదువును కొనసాగించడానికి వీలు కల్పించడంపైనే ఉంటుంది. ఇటువంటి భాగస్వామ్యాలు, వారికి విద్యాపరంగా సంపూర్ణ మద్దతును అందించే మా సామర్థ్యాన్ని బలపరుస్తాయి. దీనివల్ల ప్రతి బాలిక తమ సామర్థ్యాన్ని తెలుసుకోవడానికి, ఉజ్వల భవిష్యత్తును రూపొందించుకోవడానికి సహాయపడుతుంది" అని పేర్కొన్నారు.

**ఓయాసిస్ ఫర్టిలిటీ గురించి:** 2009లో స్థాపించబడిన ఓయాసిస్ ఫెర్టిలిటీ, భారతదేశవ్యాప్తంగా 34 కేంద్రాలతో అగ్రగామి రీప్రొడక్టివ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్. శాస్త్రీయ నైపుణ్యం, నైతిక వైద్యపద్ధతులు, అత్యున్నత ఐవీఎఫ్ విజయశాతాలతో ప్రసిద్ధి చెందిన ఓయాసిస్, ఇన్నాళ్లుగా అనేక కుటుంబాలకు ఆరోగ్యకరమైన బిడ్డలను అందించింది. పురుషులు, మహిళల కోసం ఐవీఎఫ్ ఐయుఐ, ఐసిఎస్ఐ, ఫెర్టిలిటీ ప్రిజర్వేషన్ వంటి విస్తృత సేవలను ఆధునిక ల్యాబ్ టెక్నాలజీ, వ్యక్తిగత సంరక్షణ, సంపూర్ణ వెల్‌నెస్ సహకారంతో అందిస్తోంది.

# జనసేన నేత కటకం ధర్మారావుకి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు పరామర్శ





**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** మండలంలోని గొల్లపూడి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు కటకం ధర్మారావు సతీమణి కనకదుర్గ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు బుధవారం గొల్లపూడిలోని వారి నివాసానికి విచ్చేశారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. ధర్మారావుని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మక జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు 2025తో క్రాంప్టన్‌ను సత్కరించిన రాష్ట్రపతి



**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశంలో అత్యంత విశ్వసనీయ, వినూత్న వినియోగదారు ఎలక్ట్రికల్ బ్రాండ్లలో ఒకటైన క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (సీజీసీఈఎల్), ఇంధన సామర్థ్యానికి సంబంధించి భారతదేశంలోని అతి పెద్ద జాతీయ వేదికపై సత్కరించబడింది. స్టేషనరీ స్టోరేజ్ టైప్ ఎలక్ట్రిక్ వాటర్ హీటర్ విభాగంలో ఇంధన పరిరక్షణకు కంపెనీ చేసిన అత్యుత్తమ తోడ్పాటును గుర్తిస్తూ, న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో క్రాంప్టన్‌కు గౌరవనీయులైన భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము అప్లియెన్స్ ఆఫ్ ది ఇయర్ కింద ఈ ఉపకరణానికి జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు 2025ను ప్రదానం చేశారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) ద్వారా విద్యుత్ మంత్రిత్వ శాఖ ప్రదానం చేసిన ఈ అవార్డు, అత్యుత్తమ పనితీరును అందిస్తూ శక్తి వినియోగాన్ని తగ్గించే ఉపకరణాల రూపకల్పనపై క్రాంప్టన్ దృఢమైన దృష్టిని వేడుక చేసుకునేదిగా ఉంటుంది. ఈ విజయం సంస్థ సాంకేతిక నైపుణ్యాన్ని గుర్తించడమే కాకుండా జాతీయ ఇంధన పరిరక్షణ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో క్రాంప్టన్ పాత్రను కూడా ప్రముఖంగా చాటిచెబుతుంది. క్రాంప్టన్ సీనియర్ నాయకులు – (సమావేశానికి హాజరైన ఉన్నతాధికారుల పేర్లు) – కంపెనీ తరపున అవార్డును స్వీకరించారు. ఇది ఆవిష్కరణ, సుస్థిరత్వం, వినియోగదారు-కేంద్రీకృత పరిష్కారాల పట్ల సంస్థ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. బీఈఈ 5-స్టార్ రేటింగ్ పొందిన స్టోరేజ్ వాటర్ హీటర్-3015 మోడల్, 'ఆర్నో నియో' ఉత్పాదనకు గాను క్రాంప్టన్ ఈ అవార్డును అందుకుంది. ఇది ఇంధన-ఆదా, సుస్థిరమైన ఉత్పత్తి ఆవిష్కరణలో పరిశ్రమలో అగ్రగామిగా తన స్థానాన్ని పునరుద్ఘాటించింది. 2023లో క్రాంప్టన్ సాధించిన మునుపటి విజయాన్ని అనుసరించి ఈ గుర్తింపు లభించింది. భారతదేశంలో ఇంధన-ఆదా సాంకేతికతలను నడిపించడంలో తన సుస్థిరమైన నాయకత్వంలో మరో మైలురాయిని సూచిస్తుంది. జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులు అనేది ఇంధన పరిరక్షణకు చేసిన విశిష్ట కృషిని చాటి చెప్పే ఒక ప్రముఖ వార్షిక కార్యక్రమం. 1991 డిసెంబర్ 14న ప్రారంభమైనప్పటి నుండి, భారత ప్రభుత్వ గౌరవనీయ ప్రముఖులచే ప్రదానం చేయబడే ఈ అవార్డులు, దేశంలోని వివిధ రంగాలలో ఇంధన పరిరక్షణలో ఆదర్శ ప్రయత్నాలను గుర్తిస్తున్నాయి.

ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఉన్న పరిశ్రమలు, సంస్థలను ఇంధన సామర్థ్య చర్యలను అవలంబించడానికి, ప్రోత్సహించడానికి ప్రేరేపించడంలో కూడా కీలక పాత్ర పోషించింది. ఈ సందర్భంగా క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ప్రోమీత్ ఘోష్ మాట్లాడుతూ, "మరోసారి జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డుతో, ముఖ్యంగా గౌరవనీయులైన భారత రాష్ట్రపతిచే గుర్తింపు పొందడం ఒక గొప్ప గౌరవం. ఇంధన-ఆదా ఆవిష్కరణలకు మార్గదర్శకత్వం వహించడంపై క్రాంప్టన్ నిరంతర దృష్టికి ఇది ప్రతిబింబం. బీఈఈ 5-స్టార్ రేటింగ్ పొందిన స్టోరేజ్ వాటర్ హీటర్ ఉత్పత్తి ఈ సంవత్సరం ఉపకరణంగా గుర్తింపు, పనితీరుపై రాజీపడకుండా సుస్థిరత్వానికి ప్రాధాన్య తనిచ్చే ఉపకరణాలను అభివృద్ధి చేయడంలో మా నిబద్ధతను చాటిచెబుతుంది" అని అన్నారు.



## ప్రత్యేకమైన ఎయిర్ బీఎన్బీ అనుభవాలతో లొల్లా పలూజా ఇండియా

**విజయవాడ మేజర్ న్యూస్ :** తమ మొట్టమొదటి గ్లోబల్ లైవ్ మ్యూజిక్ పార్టనర్‌షిప్‌లో భాగంగా ఎయిర్ బీఎన్బీ లొల్లా పలూజా ఇండియా 2026లో పరిచయం చేస్తున్నట్టు ఎయిర్ బియన్ బి హెడ్ అమన్‌ప్రీత్ బజాజ్ వెల్లడించారు. జనవరి 24, 25 తేదీల్లో ముంబైలోని మహాలక్ష్మి రేస్‌కోర్స్‌లో, అతిథులను వారు ఇష్టపడే సంగీతానికి మరింత చేరువ చేసేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడిందన్నారు. ఇది భారతదేశంలో ఎయిర్ బీఎన్బీ కోసం ఉత్తేజకరమైన కొత్త అధ్యాయాన్ని సూచిస్తుందని, ప్రయాణం, సంస్కృతి, సృజనాత్మకత ద్వారా ప్రజలను కనెక్ట్ చేయడంలో దాని నిబద్ధతను బలోపేతం చేస్తుందన్నారు. తెరవెనుక పర్యటనలు, కళాకారుల నేతృత్వంలోని సృజనాత్మక సెషన్‌ల నుండి లొల్లపలూజా ఇండియా ఇన్‌సైడర్ ద్వారా మార్గనిర్దేశం చేయబడిన తెరవెనుక యాక్సెస్ వరకు, ప్రతి అనుభవం భారతదేశం యొక్క అత్యంత ఎదురుచూస్తున్న సంగీత ఉత్సవాలలో ఒక దాని వెనుక ప్రపంచాన్ని మరచిపోలేని సంగ్రహావలోకనం అందిస్తుందన్నారు. "ప్రత్యక్ష సంగీతం, ప్రయాణం ఎల్లప్పుడూ ఒకదానికొకటి కలిసి ఉంటాయని, ఎయిర్ బీఎన్బీ యొక్క భారతదేశం & "లొల్లపలూజాతో మా భాగస్వామ్యం ఈ ప్రత్యేకమైన ఎయిర్ బీఎన్బీ అనుభవాల ద్వారా అభిమానులను ఆ ప్రపంచానికి చేరువ చేస్తుందని చెప్పారు. పండుగను అతిథులుగా మాత్రమే కాకుండా దాని కథలో భాగమైన అంతర్గత వ్యక్తులుగా చూసే అరుదైన అవకాశాన్ని వారికి అందజేస్తున్నారు. లొల్లపలూజా ఇండియాలో అంకుర్ తివారీ ఎన్‌టూరేజ్‌లో చేరండి, భారతదేశం యొక్క అత్యంత ప్రభావవంతమైన గాయకుడు, గేయరచయితలు, స్వరకర్తలు, కథకులలో ఒకరైన అంకుర్ తివారీతో తెర వెనుకకు వెళ్లండి. ఈ ప్రత్యేకమైన ఎయిర్ బీఎన్బీ అనుభవం అంకుర్ యొక్క సృజనాత్మక ప్రపంచంలోకి అడుగు పెట్టమని ఆయన ఆహ్వానించారు.

## ఏఐతో దేశ ఆరోగ్యం, పరిశుభ్రత, శ్రేయస్సును పునర్నిర్వచిస్తున్న యువత

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఆరోగ్య సంరక్షణలో సాంకేతికత పాత్ర ఇకపై భవిష్యత్తుకు మాత్రమే పరిమితం కాదు.. అది నేడు రోగులు ఎలా నిర్ధారణ పొందుతున్నారు.. ఎలా సంరక్షణ అందుతోంది.. ఎలా గౌరవంగా చికిత్స పొందుతున్నారు అన్నదాన్ని పూర్తిగా మార్చుతోంది. ఈ మార్పును ప్రతిబింబిస్తూ, శామ్‌సంగ్ ప్రధాన విద్యా కార్యక్రమమైన సాల్వ్ ఫర్ టుమారో 2025, ఐఐటీ ఢిల్లీ భాగస్వామ్యంతో, ఆరోగ్యం, పరిశుభ్రత, శ్రేయస్సుల భవిష్యత్తు అనే థీమ్ కింద దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులను ఏఐ-ఆధారిత, మానవ కేంద్రిత పరిష్కారాలను రూపొందించేందుకు ప్రోత్సహించింది. విజేతలు ఒక లక్ష గ్రాంట్లు, గుడ్‌విల్ అవార్డులు, యంగ్ ఇన్నోవేటర్ అవార్డులు, టాప్ 20 జట్లకు శామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫ్లిప్ స్మార్ట్‌ఫోన్‌లతో సహా అగ్ర జట్లకు అదనపు అవార్డులతో విజేతలు ఐఐటి ఢిల్లీలో కోటి రూపాయల వరకు ఇంక్యుబేషన్ మద్దతును అందుకున్నారు.

## ప్రణాళికాబద్ధంగా క్రమశిక్షణతో నడిస్తే విజయం సాధ్యం

కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ డాక్టర్ బసవేశ్వర రావు



**పామర్రు మేజర్ న్యూస్ :** జీవితానికి పునాది విద్యార్థి దశ అని, అలాంటి దశలోనే ప్రతి వ్యక్తి ప్రణాళికను రూపొందించుకుని క్రమశిక్షణ తో నడిస్తే అనుకున్న విజయం తథ్యమని మచిలీపట్నం కృష్ణా విశ్వవిద్యాలయం పరిపాలన అధికారి (రెక్టార్) ఆచార్య డా.మండవ బసవేశ్వరరావు వెల్లడించారు. మానవత సేవ సంస్థ ఆధ్వర్యంలో పామర్రు శ్రీ కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతుల శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అవగాహన తో విద్యనభ్యసించాలని, అప్పుడు యాంత్రికంగా ఆ సబ్జెక్ట్ అర్థం కాగలదని వివరించారు. శ్రద్ధ, పట్టుదల, క్రమశిక్షణ, అవగాహన విద్యార్థికి అవసరమన్నారు. మానవత పామర్రు శాఖ అధ్యక్షులు ఎన్. త్రివిక్రమరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మానవత రీజియన్ చైర్మన్ పి.ఎం.ఎస్.ప్రసాద్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ వై.ఎస్.ఎన్.ప్రసాద్, కెరియర్ గైడెన్స్ కన్వీనర్ పామర్తి వెంకట నారాయణ, డైరెక్టర్లు కేశన రవీంద్ర, బొందు సుధాకర్, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సామ్రాజ్యం తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా 8,9,10 తరగతులలో విద్యా ప్రతిభావంతులకు ధ్రువపత్రాలు, జ్ఞాపికలు, నగదు బహుమతులు మానవత సేవా సంస్థ తరపున ప్రత్యేకంగా అందచేశారు.

# దేవాలయాల దర్శనంతో ఆధ్యాత్మిక చింతన, మనస్సుకు ప్రశాంతత



**దేవాలయాలలో పాలకమండలి సభ్యులు ఆధ్యాత్మిక చింతన, భక్తి భావాలతో ప్రజల మన్ననలు పొందాలి**

**దేవాలయాల అభివృద్ధికి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎంతో సహకరిస్తోంది**

**తెలుగుదేశం రాష్ట్ర నాయకులు గొర్రెపాటి గోపీచంద్**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పెద్ద కరగ్రహారం శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పెదసింగు సామేరు, కమిటీ సభ్యులుగా బొర్రా రాము, పడమట నాగేంద్రం, పర సా వెంకటేశ్వరరావు, పర సా అంకాలు, పర సా ప్రసాద్, కట్టా రవికుమార్, తోట సాయి, నల్ల గోపుల అమ్మాజీలు ప్రమాణ స్వీకారం బుధవారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలసౌరిల సూచనలతో పెద్ద కరగ్రహారం శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు దేవస్థానం అభివృద్ధిలో ముందుండి భక్తుల సహాయ సహకారాలతో దేవస్థానం అభివృద్ధికి మరింత కృషి చేయాలని అభివృద్ధి కమిటీ సభ్యులకు గొర్రె పాటి గోపీచంద్ సూచించారు. దేవాలయాల అభివృద్ధికి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చక్కటి ప్రణాళికతో ముందుకు వెళ్తోంది అన్నారు. కమిటీ సభ్యులు భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ముందుకు వెళుతూ మంచి మంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు దేవాలయంలో నిర్వహిస్తూ భక్తుల సహకారం, ప్రభుత్వ సహకారంతో దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. దేవాలయానికి వచ్చే భక్తులు ఆధ్యాత్మిక చింతన తో దేవాలయ ప్రాంగణంలో ఎక్కువ సమయం గడిపేలా చూసుకోవలసిన బాధ్యత అభివృద్ధి కమిటీ సభ్యులదేనన్నారు. దేవాలయ ఉత్సవాలు జరిగేటప్పుడు అందరి సహాయ సహకారాలు తీసుకుంటూ భక్తుల సంఖ్యను పెంచుకుంటూ పవిత్ర శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానం అభివృద్ధిలో ప్రతి ఒక్కరిని భాగస్వాములుగా అభివృద్ధి కమిటీ వారు చేయాలని అభివృద్ధి కమిటీకి సలహా సూచనలు గొర్రెపాటి గోపీచంద్ చేశారు. దేవాలయాల దర్శనం ద్వారా ఆధ్యాత్మిక చింతన తో పాటు మనసుకు ఎంతో ప్రశాంతత కలుగుతుందని, చిన్నతనం నుండి పిల్లలకు తల్లిదండ్రులు దేవాలయాలకు వెళ్లే అలవాటును కంపల్సరిగా చేయాల్సిన బాధ్యత తల్లితండ్రులదేనన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, ఆక్వా కల్చర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, లంకె నారాయణ ప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్, కుంచే నాని, గవర్నమెంట్ హాస్పటల్ మాజీ చైర్మన్, తలారి సోమశేఖర్, మాజీ ఎంపీటీసీ, బోలెం అయోధ్య రామయ్య, మాజీ సర్పంచ్, పరసా వడ్డీ కాసులు, వేణుగోపాల స్వామి దేవస్థానం చైర్మన్, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, జనసేన నాయకుడు, తోట భాస్కరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, బత్తిన నాగరాజు, కొల్లాల అంజి, మద్దూరి ప్రసాద్, జె ఎస్ ఎస్ కృష్ణారావు, బిజెపి నాయకులు, కంచర్లపల్లి వెంకట రామారావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్, చోడవరపు లక్ష్మీప్రసన్న, ఆలయ ఈవో గోవాడ వెంకట కృష్ణారావు, ఆలయ అర్చకులు చోడవరపు ప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తించిన కుటుంబాల సర్వేను పొరపాట్లు లేకుండా నిర్వహించండి





**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** గ్రామాలలో గతంలో పి4 సర్వే ద్వారా గుర్తించిన క్రింది తరగతి వర్గాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఎటువంటి అవకత వకలు లేకుండా సేకరించాలని ఎండిఓ జె.విమాదేవి విజ్ఞప్తి చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఈ సర్వేకు సంబంధించి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండిఓ విమాదేవి మాట్లాడుతూ గతంలో తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉండి దారిద్ర రేఖకు దిగున ఉన్న వారి వివరాలను సేకరించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆ వివరాలకు సంబంధించి గుర్తించిన కుటుంబాల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని సూచించారు. ఇందులో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలన్నారు. ఏమైనా పొరపాట్లు జరిగినట్లయితే అందుకు సిబ్బంది బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వివరాలను పూర్తిస్థాయిలో సేకరించిన అనంతరం వారికి ప్రభుత్వం నుండి అందించే సంక్షేమ పథకాల కు సంబంధించి కార్డులను అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిప్యూటీ ఎండిఓ లు, మండల పరిధిలోని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన ర్యాలీ

తోట్లవల్లూరు మేజర్ న్యూస్ : మండల ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్క్రబ్ టైఫస్ అనే వ్యాధి నివారణ కోసం ప్రజలలో అవగాహన, చైతన్యం కలిగించేందుకు మండల కేంద్రమైన తోట్లవల్లూరులో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్యకేంద్ర సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, మండలము లోని గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు. ఇది పేడ పురుగు లాంటిదని, గడ్డివాముల్లోనూ, పొలాల్లోనూ చాలా చిన్నగా ఉండి కుడుతుందని ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ప్రసన్న తెలిపారు. దీనివల్ల శరీరం పై ఎర్ర మచ్చ పడుతుందని, జ్వరము, ఒళ్ళు నొప్పులు వస్తాయని పేర్కొంటూ వెంటనే ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యునికి చూపించుకుని తగు వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు ఏరియా ఆర్ఎంపీడబ్ల్యూఏ ప్రెసిడెంట్ తమ్మన ఉమామహేశ్వరరావు, కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి నెల్లి రాంబాబు, ఉపాధ్యక్షులు బెజ్జంకి బ్రహ్మేశ్వర రావు, ఫెడరేషన్ నాయకులు వల్లభాపురం జగదీష్, జిల్లా సలహామండలి సహాయ కార్యదర్శి కోదాటి యేసునాథ్, దుర్గాప్రసాద్, పాండు, వహీదుల బాబురావు, ఉయ్యూరు ఏరియా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.వెంకటేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు, వెంకట్రావు, రామారావు, ఆర్ఎంపీడబ్ల్యూఏ ఉయ్యూరు ఏరియా కార్యదర్శి వి.ఎన్.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### పేద విద్యార్థులను ఆదుకోవడంలో

# దాతలు ముందుకు రావాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కూన రాంజీ అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో ఎంసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న,కొడాలి ఆకాష్ బ్రైన్ వ్యాధితో బాధపడుతున్నాడు. అతనికి ఆపరేషన్ నిమిత్తం కావలసిన ఖర్చులో కొంత సాయం అందించేందుకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ముందుకు వచ్చింది. ఉపకులపతికి సంస్థ అధ్యక్షుడు జి కిషోర్, కార్యదర్శి డా హసీంబేగ్, ఉపాధ్యక్షుడు బొమ్మిరెడ్డి స్వామి, జిల్లా కో కన్వీనర్ ముదిగొండ శాస్త్రి లురూ 25 వేలు ఆర్థిక సాయం అందచేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి రాంజీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఒక లక్షా యాభై వేలు పోగు చేసి ఇచ్చారన్నారు. తోటి స్నేహితుని ఆదుకోవడంలో విద్యార్థులు చూపిన చొరవ స్నేహానికి దర్పణంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## పదవ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వెంట్రుప్రగడ ఎస్.పి. ఎస్.ఎన్.ఎం. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు దాతలు బుధవారం నోటు పుస్తకాలను అందజేశారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న 100 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతిరోజు నిర్వహించే పరీక్షలు రాసేందుకు అనువుగా ఒక్కొక్క సబ్జెక్టునకు ఒక పుస్తకం వంతున విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు కలిపి ఏడు పుస్తకాలు చొప్పున అందజేశారు. పాఠశాలలో చదువుతున్న మొత్తం 34 మంది పదవ తరగతి విద్యార్థులకు ఈ పుస్తకాలను అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు కె.హరి కిషోర్ తెలిపారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, ఆయన మిత్రులు జి.రవికుమార్, కె.సుబ్బారావు, సత్యనారాయణ, జె.ప్రసాద్ తదితరుల సహకారంతో ఈ పుస్తకాలను విద్యార్థులకు అందించినట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తీర్ణులు కావడం ద్వారా పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా రమేష్ చౌదరి విద్యార్థులను కోరారు.

## సెమీ క్రిస్మస్ వేడుకలలో ఎమ్మెల్యే కుమార్ రాజా




**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు టౌన్ లో శామ్యూల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగిన "సెమీ క్రిస్మస్" వేడుకలలో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రా ఓజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభువులో విశ్వాసం కలిగి సత్య వాక్యములను పలుకు వారు ఎల్లప్పుడూ అభివృద్ధి పథంలో ఉంటారని పేర్కొన్నారు. ఆయా కుటుంబాలకు ప్రభువు ఎల్లప్పుడూ రక్షణగా ఉంటాడన్నారు. ప్రతి ఒక్కరూ దేవుని యందు విశ్వాసం కలిగి ఉండి భక్తితో ఆయనను సేవించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేకును ఎమ్మెల్యే కుమార్ రాజా అతిధులతో కలిసి కట్ చేశారు. అనంతరం జరిగిన ప్రార్థనలలో సంఘ విశ్వాసులతో కలసి కుమార్ రాజా పాల్గొన్నారు.

## విద్యార్థులకు పెరుగు, మజ్జిగ అందజేత



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఐనపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఈ నెలలో 5వ రోజుగా పిల్లలందరికీ మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం వారు అందించే మెనూతో పాటుగా, దాతల సహకారంతో అదనంగా అందించే పెరుగు, మజ్జిగతో భోజనం పెట్టిస్తున్నారు. బుధవారం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ దూడల వెంకట శివనాగ భవాని వారి సొంత ఖర్చులతో పిల్లలందరికీ పెరుగు, మజ్జిగ తీసుకుని వచ్చి స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు, విద్యా కుటుంబం ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

## గురుమూర్తికి చైర్మన్ మోహన్ అభినందన



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షుడు వీరంకి గురుమూర్తికి మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు అభినందనలు తెలిపారు. వీరంకి గురుమూర్తి పనితీరును గమనించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆయనకు సముచిత స్థానం కల్పించారని మోహన్ పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధి కొరకు పని చేసే ప్రతి కార్యకర్తకు టీడీపీలో సముచిత స్థానం లభిస్తోందన్నారు. అందుకు తానే నిదర్శనమన్నారు. టీడీపీ కోసం పని చేసిన సామాన్య కార్యకర్తను అయిన తనను శ్రీ కొండలమ్మ దేవస్థాన చైర్మన్ పదవిలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నియమించిన అంశాన్ని ఆయన గుర్తు చేశారు.

# రెండు శతాబ్దాలుగా ఆబాల గోపాలం











**గుడ్లవల్లేరు డిసెంబర్ 17 మేజర్ న్యూస్ :** వేదానికి మూల భీజమైన తిరుప్పావై ధనుర్మాసంలో ప్రతి రోజూ పఠిస్తూ...ఆండాళ్ అమ్మవారి కటాక్షం పొందితే భగవంతుడు మనల్ని అనుగ్రహిస్తాడని భక్తుల విశ్వాసం. పరమాత్మను ప్రసన్నం చేసుకునేందుకు మార్గశిర మాసంలో వచ్చే ధనుర్మాసం దీక్ష చేపట్టి స్వామివారిని నెల రోజుల పాటు నిత్యం దర్శించుకుని పాశుర పఠనం చేస్తారు. ఈ మాసంలో విష్ణువును మధుసూదనుడిగా భక్తులు పూజిస్తారు. అందులో భాగంగా గుడ్లవల్లేరు శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయంలో ధనుర్మాస పూజలను వైభవంగా చేపట్టారు. 200ఏళ్ల పైబడిన ఈ సంతాన వేణుగోపాలుని ఆలయ విశిష్టత అత్యంత ఆసక్తి కరంగా ఉంటుంది.

**పూజలందుకుంటున్న వేణుగోపాలుడు :** గుడ్లవల్లేరులో కొలువై ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాల స్వామివారు భక్తుల నుంచి పూజలను అందుకుంటున్నారు. స్వామివారిని ప్రతిష్ఠించి రెండు వందల ఏళ్లకు పైగా ఈ ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలుగా వల్లభనేని వంశం వారు వ్యవహరిస్తున్నారు. ఈయన సంతాన వేణుగోపాల స్వామివారిగా కూడా భక్తుల పూజలను అందుకుంటున్నారు. ప్రస్తుతం ధనుర్మాస పూజలతో స్వామివారి సన్నిధిలో తరిస్తున్నారు.

**వేణుగోపాలుని విగ్రహాన్ని వేలంలో పాడుకున్న భూపతిరాయుడు :** ఈ సంతాన వేణుగోపాలుని గూర్చి స్థానిక భక్తులు విశ్వసించే విగ్రహ చరిత్రలోకి వెళితే చాలా అమోఘంగా ఉంటుంది. రెండు వందల ఏళ్ల క్రితం కూచిపూడిలోని భాగవతుల ఇళ్లల్లో వెన్న, నెయ్యి మాయమవుతూ ఉండేవి. పండితులు చెప్పిన మేరకు ఆ ఇళ్ల మధ్యనే ఆరు అడుగుల లోతులో గొయ్యి తవ్వగా వేణుగోపాలుని విగ్రహం బయటపడింది. ఆ దైవం తమ ఇళ్ల మధ్య ఉండకూడదని కొందరు చెప్పేసరికి ఆ ఊరి సంతలోనే ఆ విగ్రహాన్ని వేలం వేశారు. గుడ్లవల్లేరు నుంచి అక్కడికి వెళ్లిన వల్లభనేని భూపతిరాయుడు కృష్ణుడి భక్తుడు కావటంతో ఆ విగ్రహానికి ఆకర్షితులై వేలం పాటలో ఆయన పాడుకున్నారు. దానితో స్వామివారు కలలో కనబడి తనకు గుడి నిర్మిస్తే గ్రామాన్ని పాడి పంటలు, సిరి సంపదలతో తులతూగాలే చేస్తానని భూపతిరాయుడికి చెప్పారు. స్వామివారు అడిగిందే తడవుగా ఆయన నిర్మించారు. భాగవతుల కలలో కనబడి మాత్రం తనను సంతలో అమ్ముతారా? అంటూ నాట్య కళల ప్రదర్శనలు ఇచ్చే జీవనం చేయాలని స్వామివారు అన్నారు. ఆనాటి నుంచి అమెరికాలో తానాకు వెళ్లినా కూచిపూడి భాగవతులు విధిగా గుడ్లవల్లేరులో స్వామివారి సన్నిధికి వచ్చి గజ్జె కట్టి వెళ్తారు. పదేసి ఏళ్లగా సంతానం లేనివారికి సంతానం కల్పించి స్వామివారు సంతాన వేణుగోపాలునిగా కూడా గ్రామంలో ప్రసిద్ధి గాంచారు.

**దశాబ్దాలుగా గోవుల అందాల పోటీలు : వల్లభనేని వెంకట సుబ్బారావు, గుడ్లవల్లేరు నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్**

స్వామివారి ఆలయ ప్రాంగణంలో గుడ్లవల్లేరు నెహ్రూ పశువుల సంత, గ్రామాభివృద్ధి సంఘం కార్తీక శుద్ధ ఏకాదశి రోజున గోవుల అందాల పోటీలతో పాటు పాల పోటీలను నిర్వహిస్తాం. వందలాది మంది మహిళలు, విద్యార్థులకు రోజ్‌మిల్క్ పంపిణీ జరుగుతుంది. ఈ సందర్భంగా గోవులకు నిర్వహించిన అందాల పోటీలు, పాల పోటీల్లో గెలుపొందిన గో యజమానులకు బహుమతుల ప్రదానం అతిథుల చేతుల మీదుగా చేస్తాం. మహిళా భక్తులు గోపూజలు నిర్వహిస్తారు. ఈ పద్ధతి దశాబ్దాల తరబడి గ్రామంలో ఆనవాయితీగా వస్తోంది.

**1817లోనే స్వామివారి ప్రతిష్ఠ : వల్లభనేని సీతారాం, ఆలయ వంశపారంపర్య చైర్మన్**

ఈ ఆలయంలో 1817లోనే వల్లభనేని భూపతిరాయుడు స్వామివారిని ప్రతిష్టించారు. ఆ తర్వాత వల్లభనేని జగ్గయ్య, వీర రాఘవుడు, లక్ష్మణస్వామి, శీతారామయ్య, సూర్యప్రకాశరావు, వెంకట్రావు చైర్మన్లగా ఏడు తరాల వారు వ్యవహరించారు. ప్రస్తుతం ఎనిమిద తరం చైర్మన్‌గా వ్యవహరిస్తున్నాను. అలాగే అర్చకులు కూడా ఏడు తరాల వారే స్వామివారికి పూజలు ఒనరించటం విశేషం. స్వామివారి సన్నిధిలో భక్తులు ధనుర్మాస పూజల్లో తరిస్తున్నారు. నెల గంట పట్టిన నాటి నుంచి ఈ పూజలను ప్రారంభించటం జరుగుతుంది. ఆలయంలో ఒక రకంగా ఆధ్యాత్మిక పండుగ వాతావరణం నెలకొంది. విష్ణుమూర్తిగా ఈ ధనుర్మాస నెల అత్యంత ప్రీతిపాత్రమైనది.

## ప్రజాస్వామ్య పాలనకు 'ప్రజాదర్బారు' నిదర్శనం

### ఎమ్మెల్యే వసంత నాలుగు గంటల పాటు కొనసాగిన ప్రజాదర్బారు

### ఇబ్రహీంపట్నంలో 215 అర్జీలు సమర్పణ



**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రజాస్వామ్య పాలనకు 'ప్రజాదర్బారు'ల నిర్వహణ నిదర్శనమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (ప్రజాదర్బారు) నిర్వహించారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2:30 వరకు 4గంటల పాటు ప్రజాదర్బారు కొనసాగింది. మొత్తం 215 అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను ఓపిగ్గా విన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణ, రైస్ కార్డులు, ఉపాధి, పెన్షన్లు, దివ్యంగుల సర్టిఫికెట్లు మంజూరు, జాతీయ నేతల విగ్రహాల ఏర్పాటుకు, తదితరాలతో పాటు వివిధ రెవెన్యూ సేవలు, పోలీసు సేవలకు సంబంధించి అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ ప్రతివారంలో ఒక రోజు క్రమం తప్పకుండా మండల కేంద్రాల్లో ప్రజాదర్బారు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టం (పి.జి.ఆర్.ఎస్) ద్వారా ఆన్ లైన్ లో నమోదు చేసి జవాబుదారీతనంతో పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందన్నారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం, సిబ్బంది బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ప్రజలకు నాణ్యతతో కూడిన సేవలు అందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఇబ్రహీంపట్నంలో రూ.55 కోట్లతో ఇంటింటికీ నీటికుళాయి పనులు త్వరలో ప్రారంభిస్తారన్నారు. దీనికి టెండర్ల ప్రక్రియ పూర్తి అయిందని స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం గాజులపేట, ఈలప్రోలు, మైలవరం పూరగుట్ట ప్రాంతాల్లో కట్టిన కాలనీలలో ప్రధాన రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.



## ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ అధికారుల ఆధ్వర్యంలో ఇంధనం పొదుపు

**నాగాయలంక డిసెంబర్ 17 మేజర్ న్యూస్ :** నాగాయలంక మండలం నాగాయలంక గ్రామంలోని జిల్లా పరిషత్ ప్లస్ హై స్కూల్ ఆవరణలో విద్యుత్ శాఖ అధికారుల జాతీయ ఇంధన పొదుపు – ప్రగతికి మలుపు వారోత్సవాల్లో భాగంగా జిల్లా పరిషత్ హై స్కూల్‌లో వ్యాసరచన పోటీలలో పాల్గొన్న వారికి, వారి తరగతులలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు, బహుమతి ప్రధానం చేసినారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ఆపరేషన్)(డి.ఈ) బీమా.వెంకట సుధాకర్, అసిస్టెంట్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఏ.డి.ఈ (ఆపరేషన్) నడకుడితి.సుబ్రహ్మణ్యం నాగాయలంక ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్( ఆపరేషన్ ) ఏ.ఇ జి.వెంకటరాజు నాగాయలంక జిల్లా పరిషత్ హై స్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయులు అలపర్తి సత్యనారాయణ పాల్గొని ఇంధన పొదుపు గురించి సవివరంగా విద్యార్థినీ విద్యార్థులకు, తెలియపరచి వ్యాసరసేన పోటీలు నిర్వహించి బహుమతి ప్రధానం చేసినారు.

## కోడూరులో ధనుర్మాస పూజలు ప్రారంభం

**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరులో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు వైభవంగా ప్రారంభమైనది. మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు దుంబాల శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ గోదా, అమ్మవారికి ప్రత్యేక పంచామృత అభిషేకం నిర్వహించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



## పైడమ్మ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు



**పెడన, మేజర్ న్యూస్ :** గ్రామ దేవత శ్రీ పైడమ్మ అమ్మవారి ఆలయ జాతర మహోత్సవాల అనంతరం హుండీ లెక్కింపు జరిగిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి గోవాడ వెంకట కృష్ణారావు, చైర్మన్ వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందన రావు తెలిపారు. ఈ మేరకు ఆలయంలో మహిళ భక్తులచే దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీ అధికారుల,పాలకమండలి సభ్యుల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఈనెల 4 నుండి 14 వరకు అమ్మవారి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయని చెబుతూ, ఆలయ ఉండి ఆదాయం5.47 లక్షల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. జాతర మహోత్సవాల అనంతరం వచ్చే ఆదివారం జరిగే అన్న సమారాధన కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలక మండల సభ్యులు, అమ్మవారి వంశపారంపర్య కుటుంబ సభ్యులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు కే శ్రీనివాసరావు, ప్రసాద్ రావు తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాల తనిఖీ

### ఎస్ఐ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు



**గన్నవరం, డిసెంబర్ 17, మేజర్ న్యూస్ :** ఇటీవల కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని బుధవారం సాయంత్రం గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఎస్ఐ ప్రేమ్ కుమార్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ద్విచక్ర వాహనాన్ని ఆపి వాహన పత్రాలు పరిశీలించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. త్రిబుల్ రైడింగ్ ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. వాహనం నడిపే వ్యక్తే తన భద్రతకు పూర్తిగా బాధ్యత వహించాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఎస్ఐ ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫిట్స్ వచ్చి భవన నిర్మాణ కార్మికుడు మృతి



**గన్నవరం (చిన్న అవుటపల్లి), డిసెంబర్ 17, మేజర్ న్యూస్ :** పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రి ప్రాంగణంలో కొనసాగుతున్న భవన నిర్మాణ పనుల సమయంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఫిట్స్ (మూర్ఛ వ్యాధి) రావడంతో కిందపడి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం, పెద్ద అవుటపల్లి గ్రామానికి చెందిన కాటూరి రాము (42) మంగళవారం సిద్ధార్థ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న భవనంపై పనులు చేస్తుండగా అకస్మాత్తుగా మూర్ఛ వచ్చి కిందపడిపోయాడు. తీవ్ర గాయాల పాలైన రామును వెంటనే ఆసుపత్రిలోని అత్యవసర విభాగానికి తరలించి చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించి మృతి చెందాడు. రాము మృతితో పెద్ద అవుటపల్లి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మృతి చెందడంతో భార్యా, పిల్లలు కన్నీరుమున్నీరవుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## వడ్లమూడి రాఘవమ్మకి ఘననివాళి



**గొల్లపూడి మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి వాస్తవ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు వడ్లమూడి చలపతిరావు మాతృమూర్తి రాఘవమ్మ పెద్దకర్మ కార్యక్రమంలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘవమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. వడ్లమూడి చలపతిరావుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలంలో పాము కాటుకు గురై రైతు మృతి



**నాగాయలంక డిసెంబర్ 17 మేజర్ న్యూస్ :** నాగాయలంక మండలం పర్రచివర గ్రామంలో బుధవారం ఉదయం తన వ్యవసాయ పొలంలో పనిచేసుకుంటుండగా ఆరేవరపు. వీరరాఘవయ్య 42 సం. పాముకాటుకు గురి అవ్వటంజరిగినది. పాముకాటు గురైన వ్యక్తిని స్థానికులు నాగాయలంక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు సూచనల మేరకు అవనిగడ్డ ప్రభుత్వ హాస్పిటల్ కు సిఫార్సు చేయడం జరిగింది అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం వీరరాఘవయ్యను పరీక్షించిన వైద్యులు అప్పటికే (మార్గ మధ్యంలోనే) మృతి చెందినట్లుగా ధ్రువీకరించడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు వీర రాఘవయ్య కూలి పనులు చేసుకుంటూ వ్యవసాయమే జీవనాధారం గా జీవిస్తున్నట్లు భార్య ఇరువురు ఆడపిల్లలు ఉన్నట్లు బంధు వర్గాలు తెలియజేసినారు.

## మహిళా పోలీస్ కానిస్టేబుల్స్ ఉద్యోగాలు సాధించిన అక్కాచెల్లెళ్లు



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మహిళా కానిస్టేబుల్స్ గా ఉద్యోగాలు సాధించిన అక్కాచెల్లెళ్లను మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. జి.కొండూరు మండలంలోని వెల్లటూరు శివారు భీమవరప్పాడు గ్రామానికి చెందిన వంగూరు చిట్టిబాబు భవానిపురం పోలీస్ స్టేషన్ లో గత 35 ఏళ్లుగా హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఇరువురు కుమార్తెలు రత్నశ్రీ, జయశ్రీలు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నియమించిన కానిస్టేబుల్స్ ఉద్యోగాలకు అర్హత సాధించి నియామక పత్రాలు పొందారు. వీరు బుధవారం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదును ఇబ్రహీంపట్నంలో ప్రత్యేకంగా కలిశారు. వారికి శాలువాలు కప్పి సత్కరించారు. వారు భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. వారికి జ్ఞాపికలను అందజేశారు. ఎన్డీఏ కూటమి నేతలు పాల్గొన్నారు.

# హనుమాన్ జంక్షన్ బైపాస్‌లో ప్రాణాంతక రోడ్డు ప్రమాదం







### ఇద్దరు మృతి, ఒకరి ఆచూకీపై అన్వేషణ

**హనుమాన్ జంక్షన్, డిసెంబర్ 17, మేజర్ న్యూస్ :** హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కె. సీతారామపురం సమీపంలో నేషనల్ హైవే బైపాస్ వద్ద బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్నట్లు హనుమాన్ జంక్షన్ ఎస్ఐ వి. సురేష్ తెలిపారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆయన చెప్పారు. మృతుల్లో ఒకరి వయస్సు సుమారు 45 సంవత్సరాలు కాగా, వారి వివరాలు ఇప్పటివరకు తెలియరాలేదని ఎస్ఐ వి. సురేష్ వెల్లడించారు. మృతి చెందిన ఆ వ్యక్తి ఎరుపు రంగు చొక్కా ధరించి ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. మరో మృతుడు ముసునూరు మండలం తెల్లబోయనపల్లె గ్రామానికి చెందిన పేరం వెంకట రాజేష్ (21)గా గుర్తించామని ఎస్ఐ తెలిపారు. అవివాహితుడైన రాజేష్ జొమాటో సంస్థలో పనిచేస్తున్నాడని కుటుంబ సభ్యులు వెల్లడించినట్లు చెప్పారు.

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలనలు చేపట్టారని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ వి. సురేష్ తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి వివరాలు తెలిసిన వారు హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్‌ను లేదా హనుమాన్ జంక్షన్ ఎస్ఐ వి. సురేష్‌ను (ఫోన్ నం: 9440796443) సంప్రదించవలసిందిగా పోలీసులు కోరుతున్నారు.

## ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన అవనిగడ్డలో పెన్షనర్ల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. బుధవారం స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో పెన్షన్ల సాధకుడు నకార చిత్రపటానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే తనయుడు, యువ నాయకుడు మండలి వెంకట్రామ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐ జి.యువకుమార్ ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలపై పెన్షనర్లకు అవగాహన కల్పించారు. వెంకట్రామ్ మాట్లాడుతూ పెన్షనర్ల కోరికలను కూటమి ప్రభుత్వం సానుకూలంగా పరిష్కారం చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ, మరోవైపు ఒకటో తేదీ పెన్షనర్లకు పెన్షన్లు అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రామకృష్ణ, కార్యదర్శి అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో వెంకట్రామ్ పెన్షనర్లను ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ కే.నాగమల్లేశ్వరరావు, స్టేట్ బ్యాంకు బీఎం నరేష్ చంద్, ఎస్ టీ ఓ అనీష్ అహమద్ అసోసియేషన్ పెద్దలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు 5జీ మొబైల్స్ పంపిణీ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలకు నూతన 5జీ మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. అవనిగడ్డ సెక్టార్ పరిధిలోని 142 మంది అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం నూతన 5జీ మొబైల్స్ మంజూరు చేయగా, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో సీడీపీఓ షెహనాజ్ బేగం, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం పాగోలులోని శ్రీకైవల్యాశ్రమ మందిర ప్రాంగణంలోని కమలాత్మికా సహిత అచలేశ్వర మందిర కుంభాభిషేక మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వరపూజ, గురుదర్శనం, గోపూజ, పుణ్యాహవచనము, యాగశాలా ప్రవేశము,అఖండ దీపస్థాపనం, వాస్తు, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతోభద్ర మంటపారాధనలు, జలాధివాసము, క్షీరాధివాసం, గణపతి, చండీ, నారాయణ హోమములు జరిగాయి. కొత్తూరు దుర్గాసూర్యప్రసాద్ శర్మ, ఇంద్రగంటి విశ్వనాథ శర్మ, శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వేదపండితులు పూజా కార్యక్రమాలు చేశారు. శివ రుద్రస్వామి, విద్యాసాగర్ స్వాములు కుంభాభిషేక మహోత్సవాలను పర్యవేక్షించగా, ఆలయ ట్రస్టీలు మేకా బంగారుబాబు, చాపరాల గాంధీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కైవల్యాశ్రమ శిష్యబృందం, భక్తులు పెద్దఎత్తున కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో తైక్వాండో రిఫరీగా సెలక్ట్ ఈశ్వర్ అకాడమీ విధ్యార్థులు




**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** తైక్వాండో నేషనల్ పూంసె రిఫరీ సెమినార్ కోర్సుకు గాంధీ క్షేత్రం ఈశ్వర్ అకాడమీ విద్యార్థులు ఎంపికైనట్లు అకాడమీ నిర్వాహకులు తెలిపారు. ఈనెల 12 నుండి 15 వరకు తెలంగాణ జోగులాంబ గద్వాల జిల్లా లోని బృందావన్ గార్డెన్ లో జరిగిన సెమినార్లో కొరియా నుండి 8 బ్లాక్ బెల్ట్ డిగ్రీలు పొందిన ఇంటర్నేషనల్ రిఫరీ మాస్టర్ వాంగ్ యంగ్ తీ శిక్షణలో తర్ఫీదు పొందేందుకు గాంధీ క్షేత్రం ఈశ్వర్ డాన్స్ అండ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు మాస్టర్ ఈశ్వర్, మాస్టర్ విశ్వ, కె వి సుబ్బారావు, ఎస్ జాహ్నవి శ్రీ, బి శ్రీ కౌశిక్, టి రవి నాగ అరవింద్,సాత్విక, కే భార్గవి టు పాల్గొని ప్రాక్టికల్ థియరీ పరీక్షలో ప్రతిభను కనబరిచి మాస్టర్ వాన్ యంగ్ తీ వద్ద ప్రశంసలు అందుకున్నారు. మార్షల్ ఆర్ట్స్ లో దివిసీమ ఖ్యాతిని మరింత పెంపొందించాలని విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, యువ నాయకుడు మండలి రాజా లు అకాడమీ వారిని అభినందించారు.

## స్వర్గీయ మండలి విగ్రహానికి నివాళులర్పించిన కొత్తపల్లి గ్రామస్తులు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి దివిసీమ గాంధీ, ఆర్తజన బంధువు స్వర్గీయ మండలి వెంకటకృష్ణారావు శతజయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం స్థానిక వంతెన సెంటర్లోని కృష్ణారావు విగ్రహానికి టీడీపీ తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), ఘంటసాల మండలం కొత్తపల్లి గ్రామ నాయకులు జీ.సురేష్ బాబు, వీ.భాను, డీ.రామకృష్ణప్రసాద్, ఎం.ప్రసాద్, ఎం.వేణుగోపాల్, డీవీఎస్ రావు, దినేష్, చందు, ఓంకార్, సతీష్ పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గాంధీ క్షేత్రం కమిటీ ప్రధాన కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, రాయపూడి వేణుగోపాల్, రాజనాల వీరబాబు, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, బచ్చు రఘునాథ ప్రసాద్, మాచవరపు ఆదినారాయణ, యలవర్తి చిన్నా, మాదివాడ రత్నారావు, యర్రంశెట్టి సుబ్బారావు, ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య), దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, లింగం బాబూరావు మండలి వెంకటేశ్వరరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మానేపల్లి కోటయ్య, గాంధేయవాది గరికపాటి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత కోసం పాటుపడిన నాయకురాలు చంద్ర రాజకుమారి



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** మహిళా సాధికారత కోసం పాటుపడిన మహా నాయకురాలు కామ్రేడ్ చంద్ర రాజకుమారి అని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి పేర్కొన్నారు. మహిళా సమాఖ్య జాతీయ నాయకురాలు కామ్రేడ్ చంద్ర రాజకుమారి 7 వ వర్ధంతి మండల పరిధి లోని వక్కలగడ్డలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న రత్న కుమారి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడితేనే అభివృద్ధి చెందుతారని నమ్మిన రాజకుమారి మహిళలను ఆ దిశగా చైతన్య పరిచే వారని గుర్తు చేశారు. స్వామి రామానంద తీర్థ మిషన్ సహకారంతో ఎంబ్రాయిడరి, మగ్గం వర్క్, కుట్టు శిక్షణలు నేర్పి మహిళలు ఆర్థిక స్వావాలంబన దిశగా అడుగులు వేసేందుకు కృషి చేసారని గుర్తు చేశారు. ఆర్థికంగా సంపన్న కుటుంబంలో పుట్టిన రాజ కుమారి తండి చంద్ర రామలింగయ్య, బాబాయ్ కమ్యూనిష్టు పార్టీ జాతీయ నాయకులు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావుల ప్రభావంతో ప్రజా చైతన్యం వైపు నడిచారాని, మహిళల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేసారన్నారు. మహిళల పై జరుగుతున్న దాడులకు నిరసనగా ప్రభుత్వాలపై అనేక పోరాటలు చేసిన రాజ కుమారి తుది శ్వాస వరకు మహిళల పక్షాన పోరాడారన్నారు. మహిళా సమాఖ్య జాతీయ నాయకురాలిగా దేశ వ్యాప్తంగా అనేక ఉద్యమలు నిర్వహించరన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే రాజకుమారి ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్లడమే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు మల్లుపెద్ది రాణి కుమారి, సిపిఐ నాయకులు హనుమానుల సురేంద్రనాధ్ బెనర్జీ, నక్కా శ్రీనివాసరావు, కొల్లూరి శ్రీధర్, హనుమానుల సాయి బాబు, సిద్దా బత్తుల హేమార్జున తదితరులు పాల్గొన్నారు.

# గుడ్లవల్లేరులో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**గుడ్లవల్లేరు డిసెంబర్ 17 మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరులో సెమీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం రాత్రి వివిధ క్రైస్తవ సంఘాలు ఘనంగా నిర్వహించాయి. నెహ్రూ నగర్ గుడ్లవల్లేరులో ఏఐసిసి ఆధ్వర్యంలో యేసుక్రీస్తు పుట్టుక ధ్రువీకరణ ఆరాధన పేరుతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు జాన్ బెన్నీ లింగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగినది. యేసు కోసం నా ఆశ మినిస్ట్రీస్ డైరెక్టర్ జోష్ణ దేవి చేతుల మీదగా కేక్ కట్ చేయడం జరిగినది. జాన్ బెన్నీ లింగం మాట్లాడుతూ యేసు క్రీస్తు ప్రభువు వారు చరిత్రలో లిఖించబడి నిర్ధారించబడిన ఒక దైవం ఈయన మానవుల రక్షణ కొరకై పరలోక మహిమను వదిలి భూలోకానికి రావటం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులతో క్రిస్మస్ యాక్షన్ సాంగ్స్, క్యాలెండరు ఆవిష్కరణ క్యాండిల్ సర్వీస్ లతో ఘనంగా ప్రభువుని పూజించారు. అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేసి ప్రేమ విందుని ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో హైదరాబాదు దైవజనులు గ్లోరీ అన్న, రాజమండ్రి దైవజనులు రమేష్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ స్టేట్ సెక్రటరీ డాక్టర్ తీట్ల వీరయ్య, కోటప్రోలు నాగ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ, కృష్ణాజిల్లా, వైఎస్సార్సీపీ ప్రముఖులు పోస్టల్ రాజు, పెనుమాల రంగారావు, అనిల్, గోపి తదితరులు పాల్గొన్నారు.




**గోషేను చర్చ్ ఆధ్వర్యంలో...**

గుడ్లవల్లేరు జేమ్స్ పేటలో గోషేను చర్చ్ దైవజనులు గోట్రు తంబి(జిబిఆర్పీ) క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బైబిల్ మిషన్ దైవజనులు ఉజ్జీవం క్రీస్తు పుట్టుక సందేశంను అద్భుతమైన రీతిలో చేసారు. వివిధ నృత్య రూపాలు,క్రిస్మస్ సంగీతం తో అలరించారు. కార్యక్రమంలో వందలాది భక్తులు పాల్గొని క్రీస్తును ఆరాధించారు.



# డిగ్రీ కాలేజీలో వినియోగదారుల దినోత్సవం

**మొవ్వ మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన మొవ్వ వి ఎస్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పి.జి కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఎస్. మాధవి అధ్యక్షతన బుధవారం గెస్ట్ లెక్చరర్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పామర్రు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ లెక్చరర్ పి. మురళి పాల్గొని మాట్లాడుతూ వినియోగదారుల హక్కులను కాపాడే దాని కొరకు ప్రతి ఒక్కరూ వస్తువుల కొనుగోలు వినియోగం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అదేవిధంగా అమ్మకాలు జరుగుతున్నటువంటి సందర్భంలో మనం కొనుగోలు చేసే వస్తువులు వాటి యొక్క నాణ్యత గురించి అధ్యయనం చేయవలసిన అవసరం ఉందని తెలిపారు. వస్తూ మార్కెటింగ్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి నాణ్యత ప్రమాణాలు పాటించడానికి కొరకు సమాజంలో తగినటువంటి అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కామర్స్ విభాగ అధిపతి బి. శివ నాగేశ్వరరావు, డాక్టర్ కే. వెంకటేశ్వర్లు, ఆర్. ఎస్.ఎన్ మూర్తి, డాక్టర్ సిహెచ్. కుమార్ పలువురు అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం




**జగ్గయ్యపేట, డిసెంబర్ 17, మేజర్ న్యూస్ :** సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి, ఆనందంగా జీవించాలి అనే ఉన్నత ఆశయంతో, విలువలతో కూడిన వైద్య సేవలు అందించుచున్న జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్దన్ ఆధ్వర్యంలో ప్రతి పేదవారి చెంతకే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలి అనే లక్ష్యంతో మారుమూల ప్రాంతాలకు సైతం తమ ఫౌండేషన్ ద్వారా వైద్య సేవల ను నిత్యం ప్రజలకు అందించుచూ నేడు జగ్గయ్యపేట మండలం, షేర్ మహమ్మద్ పేట గ్రామంలో నిర్వహించుచున్న ఉచిత వైద్య శిబిరంలో మొత్తం 560 మందికి వైద్య సేవలు అందించడశీ జరిగిందని ఫౌండేషన్ వారు తెలిపారు. వారిలో కంటి వైద్య సేవలు పొందిన వారు 360 మంది, కంటి చూపులోపము నుండి కళ్ళజోడులు అవసరమైన వారు 180 మంది, వీరందరికీ త్వరలో జయప్రద ఫౌండేషన్ ద్వారా కళ్ళజోడులు అందజేయబడునని జయప్రద ఫౌండేషన్ యాజమాన్యం తెలియజేసారు. కంటి చూపు మందగించి శుక్లములు, పొరలు ఉన్నవారు 90 మంది, అలాగే శుక్లములు, పొరలు ఉన్నవారికి శంకర్ నేత్ర చికిత్సాలయం విజయవాడ వారి వద్ద ఉచితంగా ఆపరేషన్లు చేయించబడునని తెలిపారు. రక్త, బిపి, షుగర్,పరీక్షలు 360 మందికి చేసామని తెలిపారు. హెచ్డి రక్తపరీక్ష 200 మందికి నిర్వహించి రక్తహీనత,ఐరన్ లోపం, కీళ్ల నొప్పులకు,, షుగర్, బీపీ లకు, సంబంధించి అవసరమైన వారందరకూ ఉచితంగా మందులు అందజేయడం జరిగిందని ఫౌండేషన్ వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నెట్టెం శివరాం, ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు, కృష్ణ ఫార్మర్స్ కోపరేటివ్ సొసైటీ చైర్ పర్సన్ యానాల గోపీచంద్, ఏ ఎమ్ సి డైరెక్టర్ ఎస్ డి జాన్ బాషా,టీడీపీ ప్రెసిడెంట్ షేక్ సుభాని, లింగం నాగేశ్వరరావు, మెట్టెల రమణ, నాగులు, బడే మియా, గాలిబ్ సైదా,కాకనబోయిన బిక్షమయ్య, క్రాంతి కుమార్, అన్నపాక దుర్గ,ముల్లంగి మధు, పల్లెబోయిన బ్రహ్మం, వంకా ఏసుబాబు, శ్యాంసుందర్ రెడ్డి, వివిధ హోదాల్లో ఉన్న గ్రామ నాయకులు, ఎమ్మెల్ హెచ్ పి లు, వి ఏ ఓ లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, ఫౌండేషన్ వాలంటీర్లు ఈ శిబిరానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరికి పేరు పేరు నా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ అన్నారు.

# నడకుదుటి వారి నూతన వస్త్రాలంకరణ వేడుకలలో ఎమ్మెల్యే వసంత



**కొండపల్లి మేజర్ న్యూస్ :** నడకుదుటి వారి నూతన వస్త్రాలంకరణ వేడుకలలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. కొండపల్లి వాస్తవ్యులు నడకుదుటి శ్రీనివాసరావు, అనురాధ దంపతుల మనుమరాలు చిన్నారి హేమనందనను ఆశీర్వదించారు. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కనెక్షన్లకు ఆధార్ అనుసంధానం ప్రజలు తప్పనిసరిగా సహకరించాలి

**హనుమాన్ జంక్షన్, డిసెంబర్ 17, మేజర్ న్యూస్ :** విద్యుత్ శాఖ ఆదేశాల మేరకు బాపులపాడు మండలం పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రతి ఇంటి విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించి ఆధార్ అనుసంధానం చేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి వినియోగదారుడి విద్యుత్ సర్వీస్ నంబర్‌కు ఆధార్‌ను లింక్ చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బాపులపాడు గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కావున వినియోగదారులు తమ ఆధార్ కార్డును తీసుకొని హనుమాన్ జంక్షన్ నూజివీడు రోడ్డులోని విద్యుత్ కార్యాలయానికి హాజరై ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

# నేడు అంగన్వాడీ హెల్పర్ ఇంటర్వ్యూలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ డిసెంబర్ 17 :** గుడివాడ ఐ.సి.డి.యస్. ప్రాజెక్ట్ పరిధిలోని గుడ్లవల్లేరు మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ సహాయకురాళ్ళ పోస్టులకు రేపు అనగా డిసెంబర్ 18 గురువారం గుడివాడ ఆర్డీవో కార్యాలయములో ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూ లు నిర్వహించబడతాయని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ హాజరు కావలసినదిగా పిఓ పద్మావతి తెలియ జేసారు.

# బాలల సంరక్షణ కేంద్రాల్లో కొనసాగుతున్న తనిఖీలు



**విజయవాడ రూరల్, డిసెంబర్ 17, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాలో నున్న, భవానీపురం, ఇబ్రహీంపట్నంలో ఉన్న నూతన్ భవన్, షారోన్ గ్రేస్ చిల్డ్రన్ హోమ్, ప్రేమవిహార్, ప్రేమ్ నికేతన్ బాలల సంరక్షణ కేంద్రాలను జాయింట్ కలెక్టర్, జిల్లాస్థాయి కమిటీ ఛైర్మన్ ఎస్.ఇలక్కియ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ముందుగా నూతన్ భవన్ ను సందర్శించి అందులో ఉన్న ప్రత్యేక అవసరాల కలిగిన బాలలకు అందించే వైద్యం, ఆహారం, ఆరోగ్య పరిస్థితి గురించి జాయింట్ కలెక్టర్ ఆరా తీశారు. ఈ బాలలు ఎప్పటి నుండి ఇక్కడ ఉంటున్నారు? ఏ ప్రాంతం నుంచి వచ్చారు? అదేవిధంగా కుటుంబ సభ్యులు ఎప్పుడైనా వస్తారా తదితర అంశాలను కేంద్రం ఇంచార్జిని అడిగారు. ఫిజియోథెరఫీ సేవలు అందించే వారితో పాటు డాక్టర్ ఎప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. బాలలందరికి ప్రాథమిక విద్య అంశాలను నేర్పించాలని సూచించారు. ప్రీ స్కూల్ మెటీరియల్ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మెనూ చార్ట్ పాటించాలని సూచించారు. ప్రతిరోజు ఆకుకూరలు, కూరగాయలు, ప్రోటీన్స్ కలిగిన ఆహారం అందించాలని సూచించారు. కిచెన్, స్టోర్ రూమ్ లు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో బాలలు ఆటలు ఆడుకోవటానికి అవసరమైన స్థలం ఉండాలని సూచించారు. రిజిస్టర్లను చెక్ చేసి, జూవినెల్ జస్టిస్ చట్టం నియమ నిబంధనలు ప్రకారం అన్ని రిజిస్టర్లు ఉండేవిధంగా ఉండాలని ఆదేశించారు. తరువాత బాలలతో ముఖాముఖీ మాట్లాడి ఈ కేంద్రాలు అందిస్తున్న సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని బాలలను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం, డీసీపీవో ఎం.రాజేశ్వరరావు, జూవినెల్ జస్టిస్ మెంబెర్ వి.అన్నమణి, సీడీపీఓ పుష్పలత డా. మీనా, డా. సురేష్, ప్రభాకర్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

